# నా

"సార్. స్విస్ బ్యాంకుల్లో డబ్బు దాచుకున్న వారి పేర్లు బయట పెట్టడానికి ఆ బ్యాంకులు ఒప్పుకున్నాయిట...." పర్సనల్ సెక్రటరీ నా చెవిలో ఊదాడు.

గుండెల్లో మంట భగ్గుమంది. అగ్ని పర్వతం బ్రద్దలైంది.

మొదలు తెగిన వృక్షంలా కూలిపోయాను.

కళ్లు తెరిచేసరికి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్లో విఐపీల ప్రత్యేక ఐసియూలో ఉన్నాను.

నోటికి ఆక్సిజన్ గొట్టం. గుండెకి ఈసీజీ కనెక్షను.... చేతికి బాటిల్ నుంచి రక్తం ఎక్కిస్తూ ట్యూబు..... చుట్టూ రకరకాల మానిటర్లు.....

ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తోంటే అరడజను మంది డాక్టర్లొచ్చారు. అన్నీ చూశారు. పరీక్షించారు. ఏదేదో చెప్పుకుంటూ వెళ్ళి పోయారు.

నాకేం కానుంది? బతికి బట్ట కడతానా లేక.....!

కళ్ళల్లో నీళ్ళూరాయి.

నా భార్య, నా కొడుకు, నా కోడలు, నా కూతురు నా అల్లుడు నా మనవలు నా మనవరాండ్రు నా బంధువులు నా మిత్రులు, నా వాళ్ళు నా పార్టీ వాళ్ళు..... ఎంతగా తల్లడిల్లిపోతున్నారో!

కొన్ని గంటల క్రితం వరకూ ఏకఛత్రాధిపత్యంగా రాష్ట్రాన్ని ఏలుతున్న వాడ్ని ఇప్పుడు ఐసియూలో అపస్మారకం నుంచి తేరుకున్నా కదల్లేని స్థితిలో.....ఏ అవయావాన్నీ కదిలించలేని పరిస్థితిలో......!

జీవితం బుద్బుద ప్రాయం అంటే ఇదేనేమో!

అమ్మ గుర్తొచ్చింది. ఆ వెంటనే నా బతుకు పయనమూ.....!

చిన్నప్పుడే మా నాన్న పోయాడు. అమ్మ మావయ్య పంచన చేరి తిట్లు ఈసడింపులు భరిస్తూ నన్ను పెంచింది. నాకోసం నాకు తిండికి లోటు లేని బతుకివ్వడం కోసం తహతహలాడింది. కన్నీళ్ళు త్రాగుతూ నాకు జోల పాడింది.

ఎనిమిదో తరగతి పాసయ్యాను. "చదివింది చాల్లే" అని చెప్పి టౌన్లోని డాక్టర్ కేశరావుగారి దగ్గర కాంపౌండరుగా చేర్చాడు మావయ్య.

డాక్టరు గారి ఇల్లూ ఆసుపత్రీ ప్రక్కప్రక్కనే వుండేవి. అక్కడా ఇక్కడా అన్నీ చూసుకునేవాణ్ని మొత్తానికి వారింటి మనిషినయ్యాను. బండ చాకిరీ చేస్తున్నా సరే ఆయన రూపాయి విదిపే వాడు కాదు. ఆయన భార్య భారతాంబ నిజంగా దేవత. బట్టలు కుట్టించుకో, సినిమాకెళ్ళు అంటూ డబ్బిచ్చేది.

ఆసుపత్రికి సంబంధించిన అన్ని పనులతో బాటు వైద్యమూ నేర్చుకున్నాను. డాక్టరుగారికి అసిస్టెంటునయ్యాను. జీతం ఇవ్వడం మొదలుపెట్టారు. అమ్మని తీసుకొచ్చి టౌన్లో మకాం పెట్టాను.

రోగులకు నా మీద నమ్మకం పెరిగింది. నాతో బాధలు చెప్పుకుని మందులు రాయించుకునేవారు. డాక్టరు గారు రెండ్రోజులు ఊరుకెళ్ళినా సరే ఆసుపత్రిలో అన్నీ సవ్యంగా జరిగేలా చూసే స్థాయికెదిగాను. ఇంటి దగ్గరా పేషెంట్లని చూడటం మొదలు పెట్టాను.

"మీ కాంపౌండరు గట్టోడండీ. అతడు మాత్ర ఇస్తేచాలు ఎలాంటి జబ్బు అయినా ఠక్కున తగ్గిపోద్ది" అన్నాడు ఓ రోజున ఓ పేషెంటు డాక్టర్ గారితో.

నా ఉద్యోగం ఊడిపోయింది.

భారతాంబగారి దగ్గరికెళ్ళి ఏడ్చాను.

"టౌన్లో పోటీ ఎక్కువ. నెగ్గుకు రాలేవు గాని పల్లెకెళ్ళి ప్రాక్టీసు పెట్టుకో. ఏ చెట్టూ లేని చోట ఆముదమే మహావృక్షం. అరెమ్పీ సర్టిఫికెట్ తెచ్చుకో. ఇక నీకు తిరుగుండదు" అంటూ డబ్బిచ్చింది.

అది పెద్ద మొత్తమే. దానితో మెడికల్ ఎక్విప్మెంటు కొన్నాను.

దగ్గర్లోని పల్లెలో ఓ భూస్వామి ఇంటి అరుగుమీద ప్రాక్టీసు మొదలుపెట్టాను. ఆ ఊళ్ళోనే కాదు. ఊరికి అటూ ఇటూ ఉన్న రెండు ఊళ్ళల్లోనూ డాక్టర్లు లేరు. నా ప్రాక్టీసు జోరందుకుంది.

ఎవర్నీ ఫీజు అడిగేవాణ్ని కాదు. వారంతట వారు ఇస్తే పుచ్చుకునేవాణ్ని. ఇంజెక్షన్ చేస్తే మాత్రం రూపాయి తీసుకునేవాణ్ని. పాలూ కూరగాయలూ పండ్లూ వూరికే వచ్చి ఇంట్లో పడేవి.

'డాక్టరు గారు' అంటూ అభిమానంగా పిలిచేవారు. ఎక్కడికెళ్ళినా పెద్ద పీట వేసేవారు. నా హస్తవాసి మంచిదన్న పేరొచ్చింది. సైకిల్ మీద మూడూళ్ళూ తిరుగుతూ వైద్యం చేసేవాడ్ని.

నా మేనమామ వచ్చాడు. వాసన పసిగట్టాడు. అంతక్రితం కూతుర్నిచ్చి పెళ్ళిచేయమని మా అమ్మ నోరు తెరిచి అడిగితే విననట్టే వుండిపోయేవాడు. ఇప్పుడు తనే ఆ వూసెత్తాడు. నేను బిగిశాను. గునిశాను. తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

చాలా పెళ్ళి సంబంధాలొచ్చాయి. ఊరివి కాదని పొరుగూరికి చెందిన ధాన్యం కమీషనర్ కూతుర్ని చేసుకున్నాను.

'నోట్లో నాలిక లేకపోతే బతకలేవు' అంటూ నా చేత సత్యనారాయణ స్వామి వ్రతం చేయించారు మా మావగారు. చదివింపులొచ్చి పడ్డాయి. ఆ పైన ఏడాదికో మారు ఆ కార్యక్రమం పెట్టుకున్నాను. రోజులు హాయిగా గడిచిపోతున్నాయి.

ఊళ్ళోని పెద్దల్తో, కుర్రాళ్ళతో చక్కగా కలిసిపోయాను. ఊరి సంగతులు విశ్లేషించేవాడ్ని. ఊరి బాగుకోసం అభివృద్ధి పనులు చేపట్టడానికి వురిగొల్పేవాడ్ని.

సమస్యలొచ్చినా గొడవలొచ్చినా నన్ను పిలవడం మొదలైంది. నా మాటకి విలువ మన్నన వచ్చాయి. ఇల్లూ ఆసుపత్రీ కలిసుండేలా ప్లాను గీయించి శంకుస్థాపన చేశాను. నేను చేసిందంతే. మూడూళ్ళ వాళ్ళూ తలో చెయ్యీ వేశారు. ఇసుకా, ఇటుకా సిమెంటు నడచి వచ్చాయి. లేబర్ వాళ్ళు శ్రమదానం చేశారు. చక్కని బిల్డింగు తయారైపోయింది. అంగరంగ వైభవంగా గృహ ప్రవేశం చేశాను.

సరిగ్గా అప్పుడో కొత్త పార్టీ పుట్టుకొచ్చింది. అంతదాకా రాజకీయాలు ముసలి వాళ్ళకే పరిమితమై ఉండేవి. ఇప్పుడొక్కసారిగా కొత్తతరం రాజకీయాల్లోకి దూసుకొచ్చింది.

మావగారి సలహా మీద యమ్మెల్యే టిక్కెట్‌కి ప్రయత్నించాను. నా పేరు పలుకుబడి నాపేరు ముందున్న 'డాక్టర్' హోదా తోడ్పడ్డాయి. టిక్కెట్ రావడం కాదు యువత సాయ సంపదల్తో అసెంబ్లీలో ప్రవేశించారు.

మా ప్రాంతాభివృద్ధికి ఎన్నెన్నో ప్రణాళికలు రూపొందించాను. అధికార అనధికారుల్తో మాట్లాడాను. సమస్యలు చర్చించాను. విరుగుళ్ళు ఆలోచించాను. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను.

ప్రాక్టీసు మూలపడింది. టౌనుకు షిఫ్టయ్యాను. కారు, కార్యకర్తలు, హైదరాబాద్ ప్రయాణాలు. అధికారులు, విందులు, సమావేశాలు- ఖర్చు పెరిగింది. కాంట్రాక్టర్ల 'సహకారం' తీసుకోక తప్పలేదు.

పార్టీ నాయకత్వం సంక్షోభంలో పడింది. ఎలాగో గండం గడిచింది. కాని నాకు భయం పట్టుకుంది.

మళ్ళీ ఎన్నికలొస్తే ఏం జరుగుతుందో తెలీదు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. నా భార్యని సుఖపెట్టాలి. ఇల్లూ, బంగారం పొలాలు కొనెయ్యాలి. నా పిల్లలకి రాజభోగాలు కల్పించాలి. నన్నింత చేసిన మావగార్నీ బావమరుదుల్నీ సంతోషపెట్టాలి.

వీటిన్నిటికన్నా ముఖ్యమైందింకోటి వుంది. పదవి నిలుపుకోవడం. అందుకోసం లక్షలు కుమ్మరించడానికి సిద్ధంగా వుండాలి. రాజకీయ వైకుంఠపాళీలో కాసులున్న వాడ్ని ఏ పామూ కాటు వెయ్యదు.

కాంట్రాక్టు పనుల్లో కమీషన్లు, పైరవీలు, వాటాలు, పై వాళ్ళకి నజరానాలు....

నేను కోటీశ్వరుడ్నయ్యాను. నా పేరు పోకుండా జాగ్రత్తగా ముగ్గులు పెట్టడం అలవాటైంది. మాంసం ముక్కలు వేసి చాలా మంధ్ని ఆకట్టుకోగలిగాను. మంచి జరిగితే నా ఘనతన్నాను. చెడు జరిగితే ఎవరిదో తప్పంటూ ఒంటికాలి మీద లేచి మరీ తిట్టాను.

మళ్ళీ ఎన్నికలొచ్చాయి. గాలి వాటు తెలుసుకొని పార్టీ మారేను. ధర్నాలకీ, సభలకీ జనాన్ని తరలించడంలో స్పెషలిస్టునన్న ఖ్యాతి బాగా తోడ్పడింది. టిక్కెట్టు లభించింది. మళ్ళీ గెలిచాను. కులాల కోటాలో మంత్రి పదవీ దక్కించుకున్నాను.

నా వేళ్ళు నా చేతులు చాలా రంగాల్లోకి చొచ్చుకుపోయాయి. ఎవరికీ తెలీకుండా బినామీ పేర్లతో ఇబ్బడి ముబ్బడిగా ఆస్తులు కొన్నాను. కబ్జాలు చేశాను. కీలక స్థానాల్లో నా వాళ్ళని, నా మిత్రుల్ని, నా బంధువుల్ని నా మిత్రుల్ని నా కులస్తుల్ని 'పాతి' విశ్వాస పాత్రుల్ని పెంచుకున్నాను.

ఫలితంగా నాకు బురద అంటలేదు. సమర్థ మంత్రిని అన్పించుకున్నాను.

పార్టీలో అన్ని వర్గాలతోనూ సఖ్యంగా వున్నాను. ఢిల్లీ ప్రముఖులకి నమ్మిన బంటునయ్యాను. వారికి మూటలందించాను. ఇంకా చాలా చాలా 'సేవ'లు చేశాను. వారి సంతృప్తే నాకు నిచ్చెనమెట్లయ్యాయి.

ముఖ్యమంత్రి ఛాంబర్లో అడుగుపెట్టినప్పుడల్లా ఆయన 'సింహాసనం' మీద నుంచి దృష్టి మరల్చుకోలేకపోయేవాడ్ని. దాన్ని 'నాది' చేసుకోవడం నా కల. గమ్యం!

అందుకోసం రకరకాల ఎత్తులేశాను. మీడియాలో నా వాళ్ళని సృష్టించుకున్నాను. పార్టీలోని నా ప్రత్యర్థుల భాగోతాలు తవ్వించే వాడ్ని. తారు పూయించే వాడ్ని. లేనిపోనివి కల్పించి పై వారి చెవిలో ఊదేవాడ్ని. గాలి విత్తి సుడిగాలి మొలిపించే ఇంద్రజాల విద్య అబ్బింది.

ఏమైతేనేం నా తంత్రాంగం ఫలించింది. ఓ శుభముహూర్తాన ముఖ్యమంత్రి గద్దెనెక్కేశాను.

పట్టాభిషిక్తుడ్నవడంతో నాకు పట్టపగ్గాల్లేక పోయాయి.

నా లెవల్ పెరిగిపోయింది. విదేశీ కంపెనీలతో దేశంలోని భారీ పరిశ్రమాధిపతుల్తో సంబంధాలు ఏర్పడ్డాయి. గనుల్నీ సెజ్‌ల పేరిట వేల ఎకరాల్నీ పందేరం చేశాను. భారీ ప్రాజెక్టులు ప్రారంభించి కోట్లు విడుదల చేశాను. నా ఆస్తులెన్నో నా వాళ్ళకెంత కట్టబెట్టానో లెక్కలేదు.

నా కొడుకులూ నా అల్లుడూ నా బావమరుదులూ ప్రముఖ పరిశ్రమల్లో భారీ కాంట్రాక్టుల్లో పరోక్ష వాటాదార్లు. స్విస్ బ్యాంక్‌లోని నా ఖాతాలో ఎన్ని వేల కోట్లు చేరాయో లెక్కలేదు.

అంతా సజావుగా సాగుతోంటే పిడుగులాంటి వార్త తెచ్చి నన్ను ఆసుపత్రి పాల్జేశాడు పీఎస్.

ఖర్మాకాలి స్విస్‌బ్యాంకులు నా పేరునీ ఖాతాలోని సొమ్ముని బయటపెడితే.... నా పేరు ప్రతిష్ఠ గంగలో కలుస్తాయి. నా పదవి చేజారిపోతుంది. ఆహో ఓహో అంటూ భజన చేసిన వాళ్ళంతా ద్రోహి, వంచకుడు, దోపిడి దొంగ, లుచ్ఛా, అవినీతి సామ్రాట్ అంటూ నిందిస్తారు. శపిస్తారు. పై వాళ్ళూ క్రింది వాళ్ళూ కలిసి నన్ను బలిపశువుని చెయ్యడానికి వెనుకాడరు. ఎవరి పదవులు వారికి ముఖ్యం కదా!

మరి తలెత్తుకోలేను. జనం ముందు కెళ్ళలేను. సమాజంలో తిరగలేను.

ఇంట్లోనే గృహఖైదీనై కుళ్ళి కుళ్ళి ఏడ్వాలి!

నో.....అలాంటి పరిస్థితి రాకూడదు. ఏం చేయాలి? ఎలా చేయాలి?

మెదడు వేడెక్కిపోతోంది. రక్త పరుగులు పెడుతోంది.

నా భార్య, నా కొడుకులు, నా కూతురు, నా అల్లుడు, నా బావమరుదులు లోపలి కొచ్చారు. మూర్తీభవించిన విషాద మూర్తుల్లా వున్నారు.

భయం లేదంటూ కళ్ళతో చెప్పేను. వారు గ్రహించలేదు.

"పరిస్థితి విషమంగా వుందంటున్నారు డాక్టర్లు. ఇప్పటికే గుండెకి రెండు ఆపరేషన్లు చేశారు....." మెల్లగా చెప్పేడు పెద్ద అబ్బాయి.

భయంగా అపనమ్మకంగా చూశాను. గుండె వేగం పెరుగుతున్నట్లు తెలుస్తూనే వున్నా అదేమీ లెక్క చేయకుండా ఆదుర్దాగా ఆందోళనగా చూశాను.

"స్విస్ బ్యాంక్ ఎకౌంటు నెంబర్లు, సీక్రెట్ కోడ్‌లూ, బినామీ ఆస్తుల వివరాలూ చెబితే....."

'చెబుతాన్రా. అన్ని వివరాలు నా మెదడులో వున్నాయి. ఒక్క అంకె తప్పు లేకుండా అన్నీ చెప్పేస్తాను. కాస్తంత శక్తిని కూడ దీసుకోగానే చెబుతాను. నోట్ చేసుకుందురు గాని, ఎవర్నీ నమ్మకూడదని ఆ వివరాలన్నీ నా మెదడు లాకర్లో నిక్షిప్తం చేశాను. నా జ్ఞాపకశక్తి అమోఘమని మీకు తెలుసుగా' అని చెప్పాలని తహతహలాడాను.

ఆక్సిజన్ మాస్క్ తీశారు. చెవి ఒగ్గారు. కాని నోట మాట రాలేదు. ఎంత ప్రయత్నం ప్రగులైనా పిసరంత శబ్దం బయటికి రాలేదు! మాస్క్ తిరిగి పెట్టేశాడు కొడుకు. బాధగా చూశారు. ఏదేదో అనుకుంటూ చెవులు కొరుక్కున్నారు. తిడుతూ చిటపటలాడుతూ వెళ్ళిపోయారు. భార్య మాత్రం నా వంక బాధగా చూసి కదిలింది.

నా కళ్ళ నుండి కన్నీళ్ళు ధారలు కట్టాయి.

అంతా అయిపోయింది. నా చేతుల్లోంచి జారిపోయింది. నా వాళ్ళు నా నుండి దూరమైపోయారు. ప్రభుత్వం జప్తు చేసినా చెయ్యకపోయినా స్విస్ బ్యాంక్‌లోని నా సొమ్ము నాది కాకుండా పోతుంది. గాలికెగిరిన పేలపిండి అయిపోతుంది. ఇంకెందుకు ఇంకేమాశించి దాన్ని నేను కూడబెట్టినట్లు?

నిజంగా నేను పిచ్చివాడ్నే! నేనే లేకుండాపోయాక ఇక ఆ నా సొమ్ము గురించెందుకు దిగులూ ఆందోళనా? మానవద్రోహిగా రాక్షసాధముడిగా మిగలనున్నానా!

ఎంత చిత్రం! నా ఈ జీవితానికి జీవనానికి స్థితికి కారకులైన వారందర్నీ పూర్తిగా మర్చిపోయాను. ఇప్పుడు తలచుకుంటే తరచి చూసుకుంటే ఇది చిత్రం కాదు దారుణమన్పిస్తోంది!

ఇన్నేళ్ళూ నా కోసమే బతికేను. నిషిద్ధ ఫలాన్ని తిన్నాను. 'నా' మీది మమకారంతో శ్లేష్మంలో పడ్డ ఈగలా కొట్టుకున్నాను. ఈ లోకంలోకి వచ్చేప్పుడు ఖాళీ చేతుల్తోనే వచ్చినా పిడికిళ్ళు బిగించుకుని పుట్టాను. ఏదో సాధిస్తానని పుట్టాను. కడకి ఖాళీ చేతులు చాపి చూపుతూ వెళ్ళిపోతున్నాను!

ఈ చేతుల్తో ఎన్నో పుచ్చుకున్నాను. మరెన్నో నొల్లుకున్నాను. ఈ అర చేతుల్లోనే జనానికి స్వర్గం చూపించాను. కాని నా వాళ్ళకి తప్ప ఎవరికీ ఏమీ ఇవ్వలేదు. వాగ్దానం తప్ప దానం చెయ్యలేదు. చేయి అందివ్వలేదు. బావుకోవడమే గాని విదిలించను కూడా లేదు. దోచుకోవడమే గాని బాధ్యత నిర్వర్తించలేదు. అదే శాశ్వతమనుకున్నా గాని నేను ఆశాశ్వతుడ్ననుకోలేదు....ఇప్పుడిహ ఏం చేయడానికైనా ఏమీ మిగల్లేదు! ముఖ్యంగా కాలం!

దేవుడా! నన్ను క్షమించు..... క్షమించు....!

కళ్ళ నుండి కన్నీటి ధారలు కారి జారి కనపడని పరమాత్మ పాదాభిషేకం చేస్తున్నాయి.

అవిగవిగో శబ్దాలు. ఎవరో వస్తున్నారు.....

సందేహం లేదు. అవి యముని మహిష లోహపు గంటల గణగణలే.... కాలపాశం విసిరి ప్రాణాన్ని లాక్కెళ్ళడానికొస్తున్నాడు సమవర్తి.....!

అన్నీ అంతా ఇక్కడే వదిలి అన్నిటికీ ముగింపు పలికి నా దేహాన్ని సైతం పంచభూతాలకర్పించి అతడ్తో అనంత తీరాలకి.....!

ఒక్కసారి వెనుదిరిగి చూసుకుంటే నా జీవితం ఓ పెద్ద 'వ్యర్థం' లా కన్పిస్తోంది. ఎంత దారుణంగా బ్రతికాను. ఇందుకేనా మానవ జన్మ ఎత్తింది? ఇందుకోసమే అయితే మానవజన్మే అవసరమా?

కళ్ళ నుండి రక్తాశ్రుధారలు కారుతున్నాయి.

కానిప్పుడేం చెయ్యగలను.....ఎంత ఏడ్చినా మొత్తుకున్నా ఒక్క క్షణమూ వెనక్కి తిరిగి రాదు. టైమీజ్ అప్..... భగవంతుడు నాకిచ్చిన సమయం అయిపోయింది. పరీక్ష ఘోరంగా తప్పేను.....

వ్యర్థుడిగా వ్యథార్తుడిగా..... తలవంచుకుని ఈ లోకం నుంచి నిష్క్రమిస్తూ....!

(నవ్య వారపత్రిక 29/5/2013)